

16న పాఠశాలల్లో స్లాస్ సర్వే

సాలూరు రూరల్,ఏప్రిల్ 13: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఈ నెల 16న స్టేట్ లెర్నింగ్ అచీవ్‌మెంట్ సర్వే (స్లాస్)ను నిర్వహించనున్నారు. ఇందుకు గాను 15 మండలాల్లో 149 స్కూళ్లను ఎంపిక చేశారు. వాటిల్లో నాలుగో తరగతి విద్యార్థులకు తెలుగు, గణితం, ఆంగ్లంపై నిర్ణీత సర్వే ఫారంపై పరీక్ష నిర్వహించనున్నారు. వారి అభ్యాసన సామర్థ్యాలు తెలుసుకోనున్నారు. ఇతర మండలాల సీఎంఆర్టీ (సీఆర్పీలు)లు, ఎంఈవోలు తదితరులు పర్యవేక్షించనున్నారు. వాటికి సంబంధించి పరీక్ష పత్రాలు, ఓఎంఆర్ షీట్లు మండలాలకు వచ్చినట్టు పాచిపెంట రెండో ఎంఈవో పి.సతీష్‌కుమార్ శనివారం తెలిపారు.



వలంటీర్లపై ఒత్తిడి



● రాజీనామాలపై ఎమ్మెల్యేల ఆదేశాలు ● సోమవారం నాటికి సిద్ధం కావాలని మెసేజ్‌లు
● వీరిని ఎన్నికల ప్రచారంలో వినియోగించుకోవాలని అధికార పార్టీ వ్యూహం

(గరుగుబిల్లి)

జిల్లాలో పలు మండలాలకు చెందిన వలంటీర్లపై ఎమ్మెల్యేలు తీవ్రస్థాయిలో ఒత్తిడి తెస్తున్నారు. సోమవారం నాటికి మూకుమ్మడిగా రాజీనామాలు చేయాలని.. వెనుకంజ వేయకుండా ప్రతిఒక్కరూ రెడీగా ఉండాలని వాట్సాప్‌ల్లో మెసేజ్‌లు పంపిస్తున్నారు. దీనిపై కొందరు ఎమ్మెల్యేలు, అధికార పార్టీ ప్రతినిధులు లోపాయికారిగా ఆదేశాలిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో వలంటీర్లు ముందుకు రాకున్నా.. వారిని వదలడం లేదు. బలవంతంగా ఫోన్లు చేసి రాజీనామాలకు సిద్ధం కావాలంటున్నారు. రానున్నది 'మన ప్రభుత్వమేనని, ప్రస్తుత ఎన్నికల తరుణంలో జగన్‌కు మనమే సైన్యంలా ఉండాలని, అధికారంలోకి వస్తే మంచి భవిష్యత్ ఉంటుంది' అని హామీలు గుప్పిస్తున్నారు. 'జగన్ ఐదేళ్లలో ప్రతి ఒక్కరికీ ఆర్థిక సాయం చేశారు. ఈ మేరకు ఓటు రూపంలో రుణం తీర్చుకొనే సమయం ఆసన్నమైంది అనే రీతిలో ఓటర్లను అభ్యర్థించి తిరిగి అధి కారంలో తీసుకొచ్చే బాధ్యత మీపైనే ఉంది' అని వలం టీర్లకు పైనుంచి ఆదేశాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు కొంతమంది అయిష్టంగానే అంగీకారం తెలుపుతున్నారు. మరికొందరు ఏం చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు.

ఇదిలా ఉండగా రాష్ట్రంలో పది సర్వేలు నిర్వహించగా, అందులో 9 సర్వేలు తిరిగి జగనే అంటున్నాయన్న సమాచారాన్ని పంపి స్తున్నారు. మొత్తంగా ఒకవైపు తాయిలాలు, మరోవైపు ఒత్తిడితో వలంటీర్లు సతమతమవుతున్నారు.



వలంటీర్లకు ఎమ్మెల్యేలు పంపించిన వాట్సాప్ మెసేజీలు

ఇప్పటికే అనుకూలంగా ఉన్న వలంటీర్లను నియోజకవర్గ పెద్దలు రూ. 5 వేలు పైబడి ముందస్తుగా అందించారు. నోటిఫికేషన్ తర్వాత మరికొంత మొత్తం అందించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం వలంటీర్లతో రాజీనామాలు చేయించి.. వారిని పోలింగ్ ఏజెంట్లుగా నియమించడంతో పాటు గతంలో కేటాయించిన 50 ఇళ్ల బాధ్యతను అప్పగించేందుకు, ఎన్నికల ప్రచారం కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

టీడీపీ వైపు.. వలంటీర్ల చూపు

● రాజీనామాలకు ససేమిరా..
● జీర్ణించుకోలేకపోతున్న వైసీపీ నాయకులు

పార్వతీపురం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు భరోసాతో జిల్లాలో అత్యధిక వలంటీర్లు రాజీనామాలకు వెనుకంజ వేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే తగిన గుర్తింపు ఇవ్వనున్నట్లు హామీ ఇచ్చారని.. రూ.పది వేల చొప్పున గౌరవ వేతనం కూడా అందించనున్నట్లు ప్రకటించారని.. ఈ నేపథ్యంలో తామెందుకు రాజీనామాలు చేయాలని కొందరు వలంటీర్లు ప్రశ్నిస్తున్నారు. రాజీనామాలు చేసిన వారికి రానున్న ప్రభుత్వంలో భవిష్యత్ ఉండకపోవచ్చని పలువురు భావిస్తున్నారు. దీంతో కొంత మంది వైసీపీ వేధింపులకు దూరంగా ఉంటున్నారు. టీడీపీ వైపే చూస్తున్నారు. ఈ మార్పును కొంతమంది వైసీపీ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారు. దీంతో వలంటీర్లపై తీవ్ర ఒత్తిడి చేస్తున్నారు. తక్షణమే రాజీనామాలు చేయాలని.. లేకుంటే భవిష్యత్‌లో ఇబ్బందులు తప్పవని వాట్సాప్ మెసేజ్‌ల ద్వారా హుకుం జారీ చేస్తున్నారు. అయినప్పటికీ జిల్లాలో మెజార్టీ వలంటీర్లు రాజీనామాలు చేయడానికి ఇష్టపడడం లేదు. వైసీపీ ప్రభుత్వ కాలంలో వలంటీర్లుగా నియమించినప్పటికీ.. తామేమీ ఖాళీగా కూర్చొని రూ.5 వేలు గౌరవ వేతనం తీసు కోలేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. సంక్షేమ పథకాల పంపిణీతో పాటు అధికార పార్టీ నాయకుల సమావేశాలకు ప్రజలు తరలింపు తదితర పనులు చేపట్టినా.. వైసీపీ సర్కారు తమను గుర్తించ లేదన్నారు. గతంలో తమ గౌరవ వేతనం పెంచాలని కోరినా.. సీఎం జగన్ పట్టించుకోలేదని గుర్తు చేసుకుంటున్నారు.

ఇదీ పరిస్థితి..

జిల్లా పరిధిలో సుమారు 5,200 మంది వలంటీర్లు ఉన్నారు. అయితే ఒత్తిళ్ల భరించలేక వీరఘట్టం మండలంలో 61 మంది, భామినిలో 22, గరుగుబిల్లిలో 17 , పాచిపెంటలో 23 మంది చొప్పున మొత్తంగా 123 మంది తమ రాజీనామాలను ఎంపీడీవోలకు అందించారు. కొమరాడ, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, సీతానగరం, పాలకొండ, మక్కువ, సీతానగరం, సాలూరు, పార్వతీపురం మండలాల్లో రాజీనామాలు చేసేందుకు ముందుకు రాలేదు. అయితే గత రెండు రోజులుగా ప్రతి మండలంలోని ఎమ్మెల్యేలు రాజీనామా పత్రాల నమూనాలను సంబంధిత వలంటీర్లకు వాట్సాప్ మెసేజ్ రూపంలో పంపిస్తున్నారు. రాజకీయాల్లోకి తమను బలవంతంగా లాగొద్దని కొంతమంది వలంటీర్లు ప్రాధేయపడుతున్నా కొన్ని గ్రామాల్లో ససేమిరా అంటున్న పరిస్థితి నెలకొంది. 'మా ప్రభుత్వంలో నియమించిన మిమ్మల్ని తొలగించే హక్కు మాకే ఉంది. మేము చెప్పినట్లుగా వ్యవహరించకుంటే ఇబ్బందులకు గురికాక తప్పదు' అని హెచ్చరిస్తున్నారు. దీంతో కొంతమంది వలంటార్లు నేరుగా తమ గోడును మండల పరిషత్ కార్యాలయ సిబ్బందికి వెళ్లబుచ్చుకుంటున్నారు.

రాజకీయ లబ్ధికోసమే..

మేము రూ.5 వేల గౌరవ వేతనంతో రాత్రి, పగలనక సేవలందించాం. ఐదేళ్లలో ఎంతో కోల్పోయాం. టీడీపీ అధికారంలోకి వస్తే.. ఉపాధి అవకాశాల ద్వారా భవిష్యత్తులో మా జీవితాలు బాగుపడతాయని ఆశిస్తున్నాం. అయితే వైసీపీ ప్రభుత్వం రాజకీయ లబ్ధికోసం రాజీనామా చేయాలని మాపై ఒత్తిడి చేస్తోంది. భవిష్యత్తు కోసం ఆలోచించే నా లాంటి వారు రాజీనామా చేసే ప్రసక్తే లేదు.

- ఓ గ్రామ వలంటీర్, పార్వతీపురం మన్యం జిల్లా

మృత్యువుతో పోరాడి..

● ఢిల్లీలో విద్యుదాఘాతానికి గురైన సీఐఎస్ఎఫ్ జవాన్
● రెండు వారాలుగా అక్కడి ఆసుపత్రిలో చికిత్స
● చివరకు కన్నుమూసిన జిల్లావాసి
● స్వగ్రామంలో అంత్యక్రియలు పూర్తి



రాంబాబు (ఫైల్)

పాలకొండ: జిల్లాకు చెందిన యువ సీఐఎస్ఎఫ్ జవాన్ మృత్యువుతో పోరాడి.. చివరకు కన్నుమూశారు. ఢిల్లీలో జరిగిన హోలీ సంబరాల్లో పాల్గొన్న ఆయన విద్యుదాఘాతానికి గురై గాయాల పాలయ్యారు. అనంతరం చికిత్స పొందినా ప్రయోజనం లేకపోయింది. ఈ వార్త తెలిసి కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు శోకసంద్రంలో మునిగి పోయారు. వివరాల్లోకి వెళ్తే.. పాలకొండ మండలం గొట్ట మంగళాపురం గ్రామానికి సీఐఎస్ఎఫ్ సైనికుడు సామంతుల రాంబాబు (31) ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందారు. కొంతకాలంగా రాంబాబు ఢిల్లీలో విధులు నిర్వహిస్తున్నారు. అయితే గతనెల 25న ఆయన సహచరులతో కలిసి అక్కడ జరిగిన హోలీ సంబరాల్లో పాల్గొన్నారు ఓ భవనం నుంచి బకెట్‌తో నీళ్ల వేసేందుకు కొందరు ప్రయత్నించారు. ఇదే సమయంలో బకెట్ జారడంతో ఆ వీధిలో హైటెన్షన్ విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. దీంతో హోలీ సంబరాల్లో పాల్గొన్నవారు విద్యుత్ షాక్‌కు గురయ్యారు. ఈ క్రమంలో రాంబాబు తీవ్రగాయాలయ్యారు. వెంటనే ఆయన్ని ఢిల్లీలోని ఓ ఆసుపత్రికి తరలించారు. అయితే రెండు వారాలుగా అక్కడ చికిత్స పొందుతున్న ఆయన శుక్రవారం రాత్రి మృతి చెందారు. కాగా రాంబాబుకు వివాహం జరిగి ఎనిమిది నెలలే కావడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతునికి భార్యతో పాటు తల్లిదండ్రులు లక్ష్మి, నారాయణరావు భోరున విలపించారు. గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. కాగా శనివారం గ్రామానికి చేరుకున్న మృతదేహానికి అంత్యక్రియలు జరిపారు.

నూతన జిల్లాలో ఎన్నికలను విజయవంతం చేద్దాం

● శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ నిశాంత్‌కుమార్

సాలూరు/సాలూరు రూరల్/పాచిపెంట/కురుపాం, ఏప్రిల్ 13: జిల్లా ఏర్పడిన తర్వాత తొలిసారిగా జరగనున్న సార్వత్రిక ఎన్నికలను విజయవంతంగా నిర్వహిద్దామని కలెక్టర్ నిశాంత్‌కుమార్ పిలుపునిచ్చారు. రీపోలింగ్‌కు అవకాశం లేకుండా చూడాలని ఆదేశించారు. సాలూరు ప్రభుత్వ డిగ్రీ,పీజీ కళాశాలలో జరుగుతున్న ఎన్నికల పీవో, ఏపీవోల శిక్షణ కార్యక్రమాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురికి ప్రశ్నలు వేసి శిక్షణ గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల నిర్వహణలో ఎటువంటి తప్పిదాలు జరగకుండా చూసుకోవాలన్నారు. జిల్లాలో 1,086 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయగా, వాటికి నియమితులైన పీవో, ఏపీవోలు శిక్షణలో అన్ని అంశాలను అర్థం చేసుకొని పోలింగ్ సజావుగా నిర్వహించాలని సూచించారు. ఒక్క పోలింగ్ స్టేషన్‌లో రీపోలింగ్ జరిగినా చెడ్డపేరు వచ్చినట్టేనన్నారు. కురుపాం, పాలకొండ ఎన్నికల సిబ్బంది సాలూరు, పార్వతీపురం నియోజకవర్గాలకు, ఇక్కడి వారు అక్కడకు వెళ్తారని చెప్పారు. పీవోలు పీడీఎంఎస్ యాప్‌పై సైతం అవగాన పెంపొందించుకోవాలని సూచించారు. మాక్ పోలింగ్ మొదలుకొని స్ట్రాంగ్ రూముల్లో ఈవీఎంలను భద్రపరిచే వరకు తీసుకో వాల్సిన జాగ్రత్తను వివరించారు. పోలింగ్ పూర్తయిన తర్వత ప్రిసైడింగ్ అధికారి డైరీ రాయడం, ఫారం-17సీ నింపడం వంటి వాటిని సెక్టర్ అధికారులు పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. అనంతరం మాక్ పోలింగ్‌ను ఆయన పరిశీలించారు. స్ట్రాంగ్ రూంను తనిఖీ చేశారు.

చెక్‌పోస్టుల పరిశీలన

ఏపీ-ఒడిశా సరిహద్దుల మధ్య ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను కలెక్టర్ నిశాంత్‌కుమార్ శనివారం ఆకస్మికంగా పరిశీలించారు. సిబ్బందిని అప్రమత్తం చేశారు. తొలుత పాచిపెంట మండలంలో ఉన్న పద్మాపురం, పి.కోనవలస చెక్‌పోస్టులను తనిఖీ చేశారు. సీసీ కెమెరాల పనితీరుపై ఆరా తీశారు. సంబంధిత రికార్డులను పరిశీలించి కేసుల వివరాలను అడిగి తెలుసు కున్నారు. చెక్‌పోస్టుల సీసీ కెమెరాల ద్వారా కంట్రోల్ రూము నుంచి ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఒడిశా నుంచి మద్యం, నగదు, బంగా రం, ఆభరణాలు తదితర వస్తువులు అక్రమ రవాణా కాకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. వాటికి విధిగా ఆధారాలు చూపించాల్సి ఉందన్నారు. లేకుంటే సీజ్ చేయాలని ఆదేశించారు. నిరంతరం పటిష్ఠ నిఘా ఉండాలని, తనిఖీల్లో ఉదాసీనత ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. పార్వతీపురం ఐటీడీఏ పీవో సి.విష్ణుచరణ్, సాలూరు తహసీల్దార్ సింహాచలం, ఎన్నికల డీటీ రాజశేఖర్, ఆర్ఐ జగదీష్‌నాయుడు, వీఆర్వోలు ప్రసాద్, శ్రీనివాసరావు , సాలూరు రూరల్ సీఐ బాలకృష్ణ, పాచిపెంట ఎంపీడీవో లక్ష్మీకాంత్ తదితరులు ఉన్నారు.

● కురుపాంలో జరుగుతున్న శిక్షణ కార్యక్రమాన్ని కూడా కలెక్టర్ పరిశీలించారు. చిత్తశుద్ధితో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఎటువంటి ఆరోపణలు లేకుండా ప్రశాంతంగా పోలింగ్ జరిగేలా విధులు నిర్వర్తించాలని స్పష్టం చేశారు. నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వీవీ రమణ, తహసీల్దారులు, పీవోలు, ఏపీవోలు తదితరులు పాల్గొన్నారు.



సాలూరులో అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ఓటరుగా నమోదుకు..

ఇదే చివరి అవకాశం

● దరఖాస్తు చేసుకునేందుకు రేపటితో గడువు పూర్తి

కొమరాడ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మరికొద్ది రోజుల్లో పోలింగ్ జరగనుంది. అయితే ఈ ఎన్నికల్లో ఓటు వేయాలంటే.. జాబితాలో పేరుండాలి. ఒక వేళ పేరు లేకుంటే అర్హులైన వారంతా తక్షణమే దరఖాస్తు చేసు కోవాలి. ఓటరుగా నమోదు చేసుకునేందుకు రేపటితో గడువు ముగియనుంది. ఈ నెల 15వ తేదీ అర్ధరాత్రి వర కు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. కొత్త ఓటరు నమోదుకు ఫారం-6ను అందించాల్సి ఉంది. దీంతో పాటు చిరునామాను కూడా మార్చుకోవచ్చు. ఇందుకు గాను ఫారం-8ను వినియోగించుకోవచ్చు. గ్రామ, వార్డు సచివాలయం, తహసీల్దార్ కార్యాలయం లోని బూత్ స్థాయి అధికారులకు దరఖాస్తు అంద జేయాలి. ఓటరు హెల్ప్ లైన్ యాప్ ద్వారా కూడా ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. ప్రస్తుతం జిల్లాలో 7,75,598 మంది ఓటర్లుగా నమోదై ఉన్నారు. ఇందులో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. జిల్లాలో నాలుగు నియోజకవర్గాల పరిధిలో 3,96,766 మంది మహిళా ఓటర్లు ఉండగా, 3,78,764 మంది పురుష ఓటర్లు ఉన్నారు. మరో 68 మంది ఇతరులు కూడా ఓటు హక్కును కలిగి ఉన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

అర్హులైన వారు ఓటరుగా నమోదు కోసం ఈనెల 15 అర్ధరాత్రిలోగా దరఖాస్తులు చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో గాని, సమీపంలోని బీఎల్‌వోలకు గాని ఫారం-6 అందించొచ్చు.

- ఆనందరావు,
అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్,
పార్వతీపురం

అక్కడ అలా.. ఇక్కడ ఇలా..!

● 'మన్యం'లో నిలిచిపోయిన అనుసంధాన రోడ్ల నిర్మాణం
● సకాలంలో బిల్లులు చెల్లించని వైసీపీ సర్కారు..
● కొన్నిచోట్ల రహదారులున్నా.. రవాణా సదుపాయం సున్నా..
● ఇబ్బందుల్లో జిల్లావాసులు



అర్ధాంతరంగా నిలిచిపోయిన పాలమానుగూడ-బంధమానుగూడ రహదారి పనులు

'నూతన జిల్లా అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తాం.. గిరిజన, మైదాన ప్రాంతాల్లో అన్ని సమస్యలు పరిష్కరిస్తాం.. మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తాం' అని వైసీపీ ప్రభుత్వం కొన్నాళ్లుగా చెబుతూ వచ్చింది. కానీ ఆచరణలో మాత్రం భిన్నంగా వ్యవహరించింది. కనీసం గిరిజన ప్రాంతాల్లో అనుసంధాన రోడ్ల నిర్మాణాలు చేపట్టలేకపోయింది. ఇక జిల్లాకేంద్రానికి అతి సమీపంలో ఉన్న మైదాన ప్రాంతాలకు కూడా బస్సు సౌకర్యం కల్పించలేకపోయింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు పెదవి విరుస్తున్నారు. సర్కారు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో కొన్నిచోట్ల నెలకొన్న పరిస్థితులను ఇప్పుడు తెలుసుకుందాం..

బిల్లులు చెల్లించక..

సీతంపేట: గిరిజన ప్రాంతాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని చెబుతున్న వైసీపీ ప్రభుత్వం ప్రకటనలకే పరిమితమైంది. దీంతో క్షేత్ర స్థాయిలో భిన్న పరిస్థితులు నెలకొన్నాయి. ప్రధానంగా జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో అనుసంధాన రహదారుల నిర్మాణాలను కూడా పూర్తిచేయక పోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉపాధి నిధులున్నా.. సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో పనులకు మోక్షం లభించడం లేదు. మొత్తంగా సర్కారు తీరుపై గిరిజనులు మండిపడుతున్నారు.

ఇదీ పరిస్థితి..

సీతంపేట ఐటీడీఏ పరిధిలో 44.63 కిలోమీటర్ల మేర రహదారి పనులకు గాను రూ. 28 కోట్లను ఉపాధి హామీ పథకం కింద మంజూరు చేశారు. అయితే గడిచిన ఆరు నెలలుగా సుమారు రూ.7 కోట్ల మేర బిల్లులను వైసీపీ సర్కారు చెల్లించకపోవడంతో.. ఆశించిన స్థాయిలో రహదారి నిర్మాణాలు సాగలేదు. ప్రస్తుతం కాంట్రాక్టర్లు చేతులెత్తేయడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. మరోవైపు రహదారి సౌకర్యం లేక గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర వేళల్లో గర్భిణులు, బాలింతలు వైద్యం పొందాలంటే నానా అవస్థలు పడాల్సి వస్తోంది. కిలోమీటర్ల మేర నడిచి కొందరు, డోలీ సాయంతో మరి కొందరు సమీపంలోని పీహెచ్‌సీలు, ఏరియా ఆసుపత్రిలకు రోగులను తరలించాల్సి వస్తోంది. ఇదిలా ఉండగా 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వం మర్రిపాడు, చిన్నబగ్గ పంచాయతీ పరిధిలో ఉసిరికపాడు, రంగంవలస, ఎగువ ద్వారబందం, పెద్ద సంకిలి గ్రామాలకు ఉపాధి హామీ కింద రహదారి నిర్మాణాలకు నిధులు మంజూరు చేసింది. అయితే ఇంతవరకు ఆ రహదారి పనులను కూడా వైసీపీ ప్రభుత్వం పూర్తిచేయించకపోవడంపై గిరిజనులు పెదవి విరుస్తున్నారు. ఆయా గ్రామాలకు కనీసం వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి. దీంతో ఇటీవల ఆయా గ్రామస్థులు శ్రమదానంతో రహదారి మరమ్మతులు చేసుకొని తాత్కాలికంగా వినియోగిస్తున్నారు. మరోవైపు సాధారణ ఎన్నికల దృష్ట్యా రహదారి పనులు చేపడతామని స్థానిక ప్రజాప్రతినిధులు ప్రకటిస్తున్నప్పటికీ కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. దీంతో ఇంజనీరింగ్ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఈ విషయమై జిల్లా గిరిజన సంక్షేమశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సింహాచలంను వివరణ కోరగా ఉపాధి హామీ బిల్లులు రూ.ఏడు కోట్ల వరకు చెల్లించాల్సిన మాట వాస్తవమేనని తెలిపారు.

రవాణా సదుపాయం లేక..

పార్వతీపురం రూరల్: జిల్లాకేంద్రానికి అతి సమీపంలో ఉన్న గ్రామాలకు పక్కా రహదారులున్నా.. బస్సు సదుపాయం మాత్రం లేదు. దీంతో విద్య, వైద్యం కోసం నిత్యం జిల్లాకేంద్రానికి రాకపోకలు సాగించే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో వారు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. కొన్నాళ్లుగా ఈ పరిస్థితి ఉన్నా.. సంబంధిత అధికారులు స్పందించకపోవడంపై పల్లెవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

● పార్వతీపురం మండలంలోని పెదమరికి, చినమరికి, వీఆర్‌పేట, లక్ష్మీనారాయణపురం, గోపాల పురం, గంగాపురం, ములగ తదితర గ్రామాలకు పక్కా బీటీ రహదారులు ఉన్నాయి. పార్వతీపురానికి 10 నుంచి 15 కిలోమీటర్ల దూరంలో ఆయా గ్రామాలున్నా.. ఆర్టీసీ బస్సులు మాత్రం వెళ్లడం లేదు. గతంలో పెదమరికి నుంచి పార్వతీపు రానికి బస్సు సర్వీసును ప్రారంభించారు. కానీ ఏమైందో ఏమో.. మధ్యలోనే ఆ సర్వీసును నిలిపేశారు. దీంతో పెదమరికి, చిన మరికి, శివం ధరవలస తదితర గ్రామాలకు చెందిన ప్రజలు ప్రైవేట్ వాహనాలపై ఆధారపడి జిల్లాకేంద్రానికి రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. బస్సు సదపాయం లేకపోవడం వల్ల అనేక మంది విద్యార్థులు కళాశాలకు వెళ్లలేక మధ్యలోనే చదువుకు ఫుల్‌స్టాప్ పెడుతున్నారు. మరోవైపు గోపాలపురం, ములగ, గంగాపురం గ్రామాలకు చెందిన వారు రోజూ పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవల్సి వస్తోంది. ఇక అత్యవసర వేళల్లో రోగులను జిల్లాకేంద్రంలో ఆసుపత్రులకు తరలించాలంటే.. పరుగులు పెట్టాల్సి వస్తోంది. అంబులెన్స్ వచ్చి.. జిల్లాకేంద్రం తరలించే లోగా మార్గమధ్యంలోనే ఎంతోమంది ప్రాణాలు కోల్పోయిన ఘటనలు లేకపోలేదు. ఈ సమస్యను పరిష్కరించాలని ఆయా ప్రాంత వాసులు దీర్ఘకాలికంగా డిమాండ్ చేస్తున్నా.. సంబంధిత అధికారులు స్పందించడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని ఆ గ్రామస్థులు కోరుతున్నారు.

ఎంతో ఉపయోగం..

పార్వతీపురం నుంచి పెదమరి, చినమరికి గ్రామాలకు పక్కా రోడ్లు ఉన్నా.. బస్సులు ఎందుకు నడపడం లేదో అర్థం కావడం లేదు. తక్షణమే ఆయా ప్రాంతాలకు ఆర్టీసీ బస్సు సర్వీసు నడపాలి. దీనివల్ల ఈ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగం.

-గుంప స్వామి, టీడీపీ నాయకుడు, చిన్నమరికి

ప్రైవేట్ వాహనాలే గతి..

బస్సు సదుపాయం లేకపోవడంతో గంగాపురం, తత్తర, ములగ, వెలగవలస గ్రామాలకు చెందిన ప్రజలు ప్రైవేట్ వాహనాలనే ఆశ్రయించాల్సి వస్తోంది. దీనిపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలి. పక్కా రహదారి ఉన్న మా గ్రామాలకు రవాణా సదుపాయం కల్పించాలి.

-ఆర్.శివ, టీడీపీ నాయకుడు, ములగ



పక్కా రహదారి ఉన్నప్పటికీ రవాణా సదుపాయం లేని లక్ష్మీనారాయణపురం గ్రామం

25 కిలోల వెండి ఆభరణాల స్వాధీనం



పట్టుబడిన వెండి వస్తువులను పరిశీలిస్తున్న సీఐ మోహనరావు

రాజాం రూరల్: మండలంలోని పొగిరి చెక్‌పోస్ట్ వద్ద అక్రమంగా బస్సులో తరలిస్తున్న 25 కిలోల వెండి ఆభరణాలను రాజాం టౌన్ సీఐ దాడి మోహనరావు స్వాధీనం చేసుకున్నారు. విశాఖ నుంచి పాలకొండ వెళ్తున్న బస్సును ఎస్ఐ రవికిరణ్, సిబ్బందితో తనిఖీచేశారు.రెండు బ్యాగుల నిండుగా ఉన్న వెండి ఆభరణాలను పోలీసులు గుర్తించారు. చెక్‌పోస్ట్‌లోనే ఆభరణాలను తూకం వేయించి 25 కిలోలు ఉన్నట్లు నిర్ధారించారు. వీటి విలువ మార్కెట్ ధర ప్రకారం సుమారు రూ.20 లక్షలు ఉంటుందని అంచనావేశారు. అయితే వెండ వస్తువులను బస్సులో తరలిస్తున్న ప్రయాణికుడి వద్ద సరైన పత్రాలు లేకపోవడంతో వాటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సీఐ మోహనరావు దర్యాప్తు చేస్తున్నారు.

వాహన తనిఖీల్లో పట్టుబడిన వెండి

గజపతినగరం: ఎన్నికల కోడ్ నేపథ్యంలో శుక్రవారం అర్ధరాత్రి నిర్వహించిన వాహన తనిఖీల్లో ద్విచక్ర వాహనంలో ఏడుకిలోల వెండి పట్టుబడినట్టు సీఐ ఎస్‌వీ ప్రభాకరరావు శనివారం తెలిపారు.గజపతినగరం పట్టణం నుంచి నాలుగురోడ్ల జంక్షన్ వస్తున్న ద్విచక్రవాహనాన్ని తనిఖీచేయగా, 7కిలోల 450 గ్రాముల వెండి ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. పట్టుబడిన వెండికి సంబంధించి వాహన యజమాని చక్రధర్ వద్ద ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో జిల్లా గ్రీవెన్స్ కమిటీకి పంపించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

42 మద్యం సీసాలు...

బొబ్బిలి: బొబ్బిలి ప్రాంతంలో అక్రమంగా మద్యం రవాణా చేస్తుండగా పట్టుబడ్డ నిందితుల నుంచి 42 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు సీఐ మలిరెడ్డి నాగేశ్వరరావు తెలిపారు. కోమటిపల్లిలో మంతెన సింహాచలం నుంచి 1,800 రూపాయల విలువ చేసే 12 మద్యం సీసాలు, పాతబొబ్బిలి జంక్షన్‌లో గునుపూరు అప్పలనాయుడు నుంచి 2,980 రూపాయల విలువ చేసే 20 మద్యం సీసాలు, చింతల సత్యనారాయణ నుంచి 1500 రూపాయల విలువ చేసే 10 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. దాడుల్లో ఏఎస్ఐలు రమణ, భాస్కరరావు, సిబ్బంది పాల్గొన్నట్లు తెలిపారు.

500 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

రామభద్రపురం: మండలంలోని చందాపురం గిరిజన శివారు ప్రాంతంలో శనివారం పోలీసులు జరిపిన దాడుల్లో 500 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్ఐ జ్ఞానప్రసాద్ తెలిపారు.సారా తయారుచేయడానికి సిద్ధంగా ఉంచిన బెల్లంఊటను ధ్వంసించేసి ప్లాస్టిక్ డ్రమ్ములు స్వాధీనం చేసుకున్నామనిచెప్పారు. దాడుల్లో కానిస్టేబుళ్లు నారాయణరావు, మట్టయ్య పాల్గొన్నారు.

పార్వతీపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 527 లీటర్లు..

పార్వతీపురంటౌన్: పలు కేసుల్లో స్వాధీనం చేసుకున్న సారాను ధ్వంసం చేసినట్టు ఎక్సైజ్ సీఐ కృష్ణారావు తెలిపారు. సీఐ బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఆదేశాల మేరకు ఏఎస్పీ సునీల్ నరైన్ ఆధ్వర్యంలో పార్వతీపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 8 సారా కేసుల్లో స్వాధీనం చేసుకున్న 527 లీటర్ల సారాను పట్టణ శివారుల్లో ధ్వంసం చేశామని సీఐ చెప్పారు. ఎవరైనా సారా తయారుచేయడంతోపాటు రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

● **వీరఘట్టం:** మండలంలోని గంగంపేట, రాజపురం గ్రామాల మధ్యలో సారా తరలిస్తున్నారని సమాచారం అందడంతో పోలీసు సిబ్బంది అక్కడకు చేరుకుని 60 లీటర్ల సారా తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామని ఎస్ఐ ఫక్రుద్దీన్ తెలిపారు.

ట్రాఫిక్ పోలీసుల తనిఖీలు

విజయనగరం క్రైం: నగరంలో శనివారం ట్రాఫిక్ డీఎస్పీ విశ్వనాథ్ ఆధ్వర్యంలో ఎస్ఐలు లోవరాజు, మహేశ్వరరాజు, సిబ్బంది ప్రధాన కూడళ్లలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. త్రిబుల్ రైడింగ్, వాహనపత్రాలు, లైసెన్సులు లేని వాహనదారులపై కేసులు నమోదు చేశారు.

● **శృంగవరపుకోట రూరల్:** మండలంలోని వెంకటరమణపేట వద్ద ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ వాహనాలు తనిఖీచేసింది. ఈ మార్గంలో రాకపోకలు చేసే ప్రతి వాహనం ఆపి క్షుణంగా సిబ్బంది పరిశీలించారు.

గడ్డి కుప్పలు దగ్ధం

మక్కువ: మండలంలోని కోన గ్రామంలో రెండు వరిగడ్డి కుప్పలు దగ్ధమయ్యాయి.శనివారం మధ్యాహ్నం ఒక్కసారిగా ఈదురు గాలులు వీయడంతో పైనున్న విద్యుత్ వైర్లు ఒకదానికొకటి అంటుకుని పక్కనే ఉన్న మరిశర్ల సీతంనాయుడు, వాకాడ సత్యంకు చెందిన రెండు వరి గడ్డికుప్పలు అగ్నికి ఆహుతయ్యాయి. ఒక్కసారిగా మంటలు రావడంతో స్థానికులు అప్రమత్తమై మంటలను కొంతవరకు అదుపు చేసి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. పక్కనే మరో 15 గడ్డికుప్పలతో పాటు ఇళ్లు కూడా ఉన్నాయి. ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

పామాయిల్ తోటకు నిప్పు

కొమరాడ: సీతామాంబపురం (అగ్రహారం) గ్రామానికి సమీపంలో వేసిన పామాయిల్ తోటకు నిప్పంటుకోవడంతో తోట మొత్తం ధ్వంసమైంది. తోటలో నీటి సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన డ్రిప్ పరికరాలు కాలి బూడిదయ్యాయి. దీంతో రైతు విశ్వేశ్వరరావు లబోదిబోమంటున్నారు. మొక్కలకు నీటి సౌకర్యం కల్పించేందుకు డ్రిప్ ఏర్పాటు చేసుకోవడానికి వేలాది రూపాయలు ఖర్చు అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట చేతికి వస్తుందన్న తరుణంలో తోటకు నిప్పంటుకోవడంతో కాపు (గెలలు) కూడా వచ్చే అవకాశం లేదని అన్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.

ఎన్నికల్లో పీవోలదే కీలక పాత్ర

● *స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రమీల*

బొబ్బిలి:ఎన్నికల నిర్వ హణలో పీవోలదే కీలక పాత్ర అని ఎన్నికల అధి కారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రమీల తెలిపా రు. శనివారం బొబ్బిలి గొ ల్లపల్లి శ్రీవేణుగోపాల ము నిసిపల్ పాఠశాలలో పోలింగ్ అధికారులకు ని ర్వహిస్తున్న శిక్షణ శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ నిర్వహణా ధికారులకు పలు సూచనలు చేశారు. పోలింగ్ ప్రక్రియలపై పూర్తి స్థాయిలో అవ గాహన ఉండాలన్నారు.పోలింగ్ ముగిసిన తరువాత సమర్పించాల్సిన ఫార్మాట్ విష యంలో జాగ్రత్తలను పాటించాల న్నారు. ఎక్కడా రీపోలింగ్‌కు అవకాశం రానీయ కుండా పక్కాగా ప్రక్రియను పూర్తిచేయాలన్నారు. ఈవీఎంలు, వీవీ ప్యాట్ల పని తీరుపై పీవోలు, ఏపీవోలు అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారుల విధులు, బాధ్యతలు, సాంకేతిక అంశాలపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఓటరు ఓటుహక్కు వినియోగించుకునేం దుకు సుమారు ఏడు సెకెండ్లు పడుతుందని, దీని ఆధారంగా అవసరమైన ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని, పోలింగ్‌కు 90 నిమిషాల ముందే మాక్‌పోల్ నిర్వహించాలని చెప్పారు. మాక్ పోలింగ్ తరువాత వాటిని ఈవీఎంల నుంచి వెంటనే తొలగించాలన్నారు. మాక్‌పోలింగ్ నిర్వహించకపోతే పోలింగ్ రద్దయ్యే అవకాశముందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్లు త్రినాథరావునాయుడు, సులోచనరాజారావు, డీటీలు రెడ్డి సాయికృష్ణ, ఎంఈవో గొట్టాపు వాసు, మాస్టర్ ట్రైనీలు జేసీ రాజు, సీహెచ్‌జే ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

జామిలో అక్కమ్మ, ఎర్రమ్మ పేరంటాలు తీర్థం

జామి: జామిలో రైతులు తమపొలాల్లో ఏరువాక పూజలు చేశాక సంప్రదాయంబద్ధంగా అక్కమ్మ, ఎర్రమ్మపేరంటాలు తీర్థం నిర్వహించి వారికిపూజలుచేశారు. అమ్మవార్లకు పసుపుకుంకాలు సమర్పించి అన్నదానంచేశారు.

సముద్రంలో వేటకు విరామం

● రెండు నెలలపాటు అమలు ● రేపటి నుంచి బోసిపోనున్న తీరం



భోగాపురం

సముద్రంలో మత్స్యసంపద పెంపొందించేందుకు రెండునెలల పాటు వేట విరామం సోమవారం నుంచి ప్రారంభంకానుంది. వేట సాగించే మత్స్యకారులు, మత్స్యసంపద కొనుగోలు చేసుకోనేవారితో తీరం నిరంతరం కలకలలాడేది. చేపల వేట నిషేధం అమల్లోకి రానుండడంతో తీరం బోసి పోనుంది. సోమవారం నుంచి 61 రోజులపాటు సముద్రంలో చేపలవేట చేయకూడదని ప్రభుత్వం నిషేధాజ్ఞలు జారీచేసింది. వేటనిషేధానికి సంబందించి గ్రామాల్లో మత్స్యకార సిబ్బంది మత్స్యకారులకు అవగాహన కల్పించారు. రొయ్యలు, చేపలు సంతానోత్పత్తి సమయం కావడంతో తల్లి చేపలు, తల్లిరొయ్యలను సంరక్షించడానికి వాటి ఉత్పత్తిని పెంచడానికి మత్స్యసంపద అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం 61 రోజుల పాటు వేటనిషేధం ఏటా అమలు చేస్తోంది. దీంతో మెకనైజ్‌డ్, మోటరైజ్ బోట్లు సముద్ర జలాల్లో చేపలవేట చేయ రాదు. వేట నిషేధం అమలు నేపథ్యంలో మత్స్యకారులు మరబోట్లను, వలలు, వేట సామగ్రిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. విలువైన పరికరాలను ఇళ్ల వద్ద భద్రపరచుకుంటున్నారు.

ఇదీ పరిస్థితి..

జిల్లాలోని భోగాపురం, పూసపాటిరేగ మండలాల్లో ముక్కాం, చేపలకంచేరు, కొండ్రాజుపాలెం, చింతపల్లి, పతివాడ, తిప్పవలస, కోనాడ, కొల్లాయివలసల్లో 3,400 కుటుంబాలు ప్రత్యక్షంగా, మరో 1600 కుటుంబాలు పరోక్షంగా సముద్ర మత్స్య సంపదపై ఆధారపడి జీవిస్తున్నాయి. వేటనిషేధం అమలు కానుండడంతో ఆయా కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బంది పడనున్నాయి. రిజిస్ట్రేషన్ చేసుకున్న బోట్లకు మాత్రమే ప్రభుత్వం రూ.10వేలు చొప్పున భృతి మంజూరు చేయనుంది. రిజిస్ట్రేషన్ చేసుకున్న బోట్లలో తీరంలో ఉంచిన బోట్లను మాత్రమే గణన చేసి వారికి మాత్రమే భృతి అందజేయనున్నారు. వేట నిషేధ సమయంలో మర బోట్లతో వేటకు వెళ్తే ప్రభుత్వం చట్ట రీత్యా చర్యలు తీసుకోనుంది. సంప్రదాయ పడవలు మాత్రం వేట నిషేధ సమయం సముద్రంలో ఎనిమిది నాటికల్ మైళ్ల దూరంలోపల మాత్రమే వేటసాగించుకోవచ్చు. సోమవారం నుంచి వేటనిషేధం అమలు కానుండడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.

వేటనిషేధం పక్కాగా అమలు చేస్తాం..

ఈనెల 15నుంచి జూన్ 14వరకు 61 రోజుల పాటు సముద్రంలో తల్లిచేపలు, రొయ్యలు సంతానోత్పత్తి జరుగుతుందని మత్స్యశాఖ ఉపసంచాలకులు ఎన్.నిర్మలకుమారి తెలిపారు. మత్స్యసంపద ఉత్పత్తి, అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వేట నిషేధం అమలు చేస్తుందని చెప్పారు.. వేట నిషేధం పక్కాగా అమలు చేస్తామని తెలిపారు. నిషేధ ఆజ్ఞలు ఉల్లఘించిన బోటు యజమానులపై ఏపీఎంఎఫ్ఆర్ చట్టం-1994 ప్రకారం బోట్ లైసెన్స్ రద్దు చేయడంతో పాటు నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

● *బొబ్బిలి నియోజకవర్గ కూటమి అభ్యర్థి బేబీనాయన*



తారకరామాకాలనీలో ప్రచారం చేస్తున్న బేబీనాయన, సుజయ్, తెంటు

బొబ్బిలి: విజన్ కలిగిన చంద్రబాబు హయాంలో మళ్లీ సంపద సృష్టించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకోగమని బొబ్బిలి నియోజకవర్గ ఎన్‌డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్‌వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయన) తెలిపారు.శనివారం స్థానిక తారకరామా కాలనీలోమాజీ మంత్రి సుజయ్‌కృష్ణరంగారావు, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడులతో కలిసి ప్రచారం చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు గిరడ అప్పలస్వామి, పాలూరు బాబు, లంక రమేష్, పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు రాంబా ర్కి శరత్‌బాబు, వాసిరెడ్డి సత్యనారాయణ, నాయకులు పువ్వల శ్రీనివాసరావు, సాయిరమేష్ పాల్గొన్నారు.

● **తెర్లాం:** మండలంలోని చీకటిపేట, పూనువలస, పెదపాలవలసలో బొబ్బిలి నియోజకవర్గ కూటమి అభ్యర్థి బేబీనాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మంనాయుడు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు నర్సుపల్లి వెంకటనాయుడు, నాయకులు ముడడ్ల పార్వతి, చీకటి తిరుపతి, సరస్వతి, వెంకటేశ్వరరావు, జనసేన మండలాధ్యక్షుడు మరడాన రవి, యుగంధర్,సర్పంచ్ జవాన రమేష్ పాల్గొన్నారు.

వైసీపీ బెదిరింపులకు లొంగవద్దు

● *టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుజయ్‌కృష్ణ రంగారావు*

బొబ్బిలి: వైసీపీ ప్రభుత్వం, ఆ పార్టీ నాయకులు చేస్తున్న బెదిరింపులు, ఒత్తిళ్లకు వలంటీర్లు ఎట్టి పరిస్థితుల్లో లొంగవద్దని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్‌వీ సుజయ్ కృష్ణరంగారావు తెలిపారు. శనివారం బొబ్బిలిలో విలేకరులతో మాట్లాడుతూ వలంటీర్లకు సంబంధించి మంత్రి ధర్మాన ప్రసాదరావు చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. సీఎం జగన్ ధనబలంతో అందర్నీ కొనుగోలు చేయాలని చూస్తున్నారన్నారు. సమావేశంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు రాంబార్కి శరత్‌బాబు, సుంకరి సాయిరమేష్, సుంకర సత్తిబాబు, మున్నా పాల్గొన్నారు.

●**రామభద్రపురం:**వైసీపీని తరిమికొట్టినప్పుడే రాష్ట్రానికి మంచిరోజులు వస్తాయని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుజయ్‌కృష్ణరంగారావు తెలిపారు. బూసాయవలసలో విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ ఎన్ని కుట్రలు చేసినా ఎన్డీయే కూటమి విజయంసాధిస్తుందన్నారు.సమావేశంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మడక తిరుపతి నాయుడు, టీడీపీ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు కర్రోతు తిరుపతిరావు పాల్గొన్నారు.

170 కుటుంబాలు టీడీపీలో చేరిక



టీడీపీలో చేరిన వారితో కోండ్రు మురళీమోహన్

రాజాం: రాజాంలోని శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో 170 కుటుంబాలు శనివారం టీడీపీలో చేరాయి.రాజాం మండలంలోని అంతికాపల్లికి చెందిన 70 కుటుంబాలు, రేగిడి మండలంలోని ఆడవరం లక్ష్మీపురానికి చెందిన 20, వన్నలి, వెంకంపేట గ్రామాలకు చెందిన 30 కుటుంబాలు చొప్పున, వంగర మండలంలోని బంగారువలసకు చెందిన 20 కుటుంబాలకు రాజాం నియోజకరవ్గ టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ కండువాలువేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని దివాళా తీసేస్థాయికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చారని ఆరోపించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుమల వెంకట, మన్మథరావు, కిమిడి అశోక్‌కుమార్, దూబ ధర్మారావు,పాలూరి రామినాయుడు, ఎస్.అప్పలనాయుడు, హరిచందక రాము, మజ్జి శ్రీను, వెంకటరావు,రాజేష్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజాగళం సభను విజయవంతం చేయండి

ప్రజాగళం సభను వియవంతం చేసేలా అందరు కృషి చేయాలని నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ కోరారు. శనివారం రాత్రి పురపాలక సంఘం పరిధిలోని కొత్తవలసలో అభయాంజనేయస్వామి ఆలయం విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమంలో పాల్గొన్నారు.అనంతరం మాట్లాడుతూ సోమవారం జరిగే చంద్రబాబునాయుడు రోడ్‌షో, ప్రజాగళం సభ విజయవంతం చేయాలని కోండ్రు కోరారు.

సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన

బాడంగి: మండలంలోని కోడూరు గొల్లవీధిలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలను శనివారం విజయనగరం టీడీపీ పార్లమెంట్ బీసీ సాధికారిత సమితి కన్వీనర్ కొల్లి అప్పలనాయుడు ఆధ్వర్యంలో ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మరిపి రమేష్, కొల్లి సత్యారావు, కొల్లి చిన్నంనాయుడు పాల్గొన్నారు.

ఐదేళ్లుగా ప్రజా వ్యతిరేక పాలన

● *విజయనగరం నియోజకవర్గ కూటమి అభ్యర్థి అదితి గజపతిరాజు*



30వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్: ఐదేళ్ల వైసీపీ పాలన ప్రజా వ్యతిరేకంగా సాగిందని విజయనగరం నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి అదితి గజపతిరాజు ఆరోపించారు. శనివారం విజయనగరం కార్పొరేషన్‌లోని 30వ డివిజన్‌లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థులుగా తనను, కలిశెట్టి అప్పలనాయుడును గెలిపించాలని కోరారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే ఇంటర్ చదివే విద్యార్థినుల కోసం కలలకు రెక్కలు కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారని, దీంతో విద్యార్థినులకు ఉన్నత చదువులకు అవకాశం లభిస్తుందని వివరించారు.కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ ప్రసాదుల కనకమహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన వైసీపీ: కోళ్ల



శృంగవరపుకోట రూరల్: ధర్మవరంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

శృంగవరపుకోట: వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని ఎస్.కోట నియోజకరవ్గ టీడీపీ అభ్యర్థి కోళ్ల లలితకుమారి ఆరోపించారు. శనివారం శృంగవరపుకోట గాంధీనగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ సండి సోమేశ్వరరావు, వైస్‌ఎంపీపీ ఇందుకూరి సుధారాణి, సర్పంచ్ గనివాడ సంతోషికుమారి, టీడీపీ నాయకులు జీ.ఎస్ నాయుడు, రెడ్డి వెంకన్న, కొణదం మల్లేశ్వరరావు, వాకాడ బాలు, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

●**శృంగవరపుకోట రూరల్:** మండలంలోని ధర్మవరంలో మాజీ సర్పంచ్ వైసీపీ నేత గొర్లె దేముడు ఆధ్వర్యంలో 50 ఎరుకుల, 50 యాత కుటుంబాలు వైస్ ఎంపీపీ ఇందుకూరి సుధారాజు ఆధ్వర్యంలో టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా కూటమి అభ్యర్థి లలితకుమారి, సుధారాజు,గొంప కృష్ణ మాట్లాడుతూ అన్ని వర్గాలు వైసీపీని బంగాళాఖాతంలో తోసేందుకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. కార్యక్ర మంలో సర్పంచ్ గాలి సన్యాసయ్య, జీఎస్ నాయుడు,రెడ్డి వెంకన్న, రాయరవపు చంద్ర శేఖర్, జుత్తాడ రామసత్యం, న్యాయవాది మండా కామేశ్వరరావు పాల్గొన్నారు.

●**వేపాడ:**వేపాడకు చెందిన వైసీపీ నాయకుడు భోజంకి లక్ష్మ ణరావు శుక్రవారం రాత్రి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బుచ్చి అప్పల రాంప్రసాదు సమక్షంలో టీడీపీలో చేరారు. సింగరాయిలో శుక్రవారం రాత్రి జయహో బీసీ నిర్వహించారు.కార్యక్రమంలో నాయకులు నిరుజోగి దాలినాయుడు, రంభ శంకరరావు, సూరి దేముడు, నిరుజోగి బంగారునాయుడు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కొట్యాడ రమణమూర్తి, పార్టీ మండల ఉపాధ్యక్షుడు పోతల వెంకటరమణ, మాజీ ఎంపీపీ దాసరి లక్ష్మి పాల్గొన్నారు

ఎన్నికలు సజావుగా జరగాలి: కలెక్టర్

శృంగవరపుకోట: ఎన్నికలు సజావుగా జరిగేందుకు అధికారులు సహకరించాలని కలెక్టర్ నాగ లక్ష్మి కోరారు. శనివారం శృంగవరపుకోట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఎన్నికల శిక్షణ తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా పీవోలు, ఏపీవోలు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. ఎన్నికల శిక్షణ తరగతులను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికల అధికారి మురళీకృష్ణ, సహాయ ఎన్నికల అధికారి కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

విధులు సక్రమంగా నిర్వహించాలి: జేసీ



మాట్లాడుతున్న కార్తీక్

రాజాం: ఎన్నికల విధులు పీవోలు సక్రమంగా నిర్వహించి మంచి గుర్తింపును తీసుకురావాలని జేసీ కార్తీక్ కోరారు. శనివారం రాజాం ప్రభుత్వోన్నత పాఠశాలలో పీవోలకు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎల్.జోషప్, తహసీల్దార్ ఎస్.కృష్ణంరాజు, ఎన్నికల డీటీ ప్రకాష్, ప్రత్యేకాధికారి బి.సుధాకర్ పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కొమరాడ:గ్రామాల్లో జ్వరాలు, వ్యాధులు ప్రబలకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్మోహన్‌రావు ఆదేశించారు. శనివారం కళ్లికోటలో పర్యటించారు.జ్వరలక్షణాలతో ఎవరైనా ఉన్నారా అని ఆరా తీశారు. ఇళ్లలో దోమతెరల వినియోగంపై గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డాక్టర్ జగన్మోహన్‌రావు స్థానిక హెల్త్ వెల్‌నెస్ కేంద్రంలో రికార్డులు తనిఖీచేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో సూర్యనారాయణ, పీహెచ్ఎన్ విజయకుమారి, వైద్య సిబ్బంది రామకృష్ణ, నరేంద్ర పాల్గొన్నారు.

మందుబాబులకు అగచాట్లు

● **స్టాకు ఉన్నా లేదని పంపించేస్తున్న సిబ్బంది**

మెంటాడ: మెంటాడలో ప్రభుత్వ మద్యం దుకాణాల సిబ్బంది మందుబాబులకు అగచాట్లు తప్పడంలేదు. దుకాణం లోపల స్టాక్ ఉన్నా బయట షోకేసులను ఖాళీగా చూపుతున్నారని పలువురు వాపోతున్నారు.ఒక వ్యక్తి ఒక సీసా చొప్పున మాత్రమే అని చెప్తున్న సిబ్బంది.. పని వేళలను గాలికొదిలి వారికి నచ్చిన సమయంలోనే విక్రయాలు జరుపుతున్నారని మద్యం కొనుగోలుదారులు చెబుతున్నారు. ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు తెరచి ఉండాల్సిన షాపులు రోజు మొత్తమ్మీద రెండు మూడు గంటలకు మించి పనిచేయడం లేదని ఆరోపిస్తున్నారు. దీంతో శనివారం షాపుల ముందు మద్యం ప్రియులు గంటల తరబడి క్యూలో ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామాల్లో బెల్ట్‌షాపుల్లో మాత్రం కావాల్సినన్ని సీసాలు లభ్యమవుతున్నాయని, బెల్ట్ దుకాణాల నిర్వాహకులు ఇచ్చే కమీషన్‌కు కక్కుర్తిపడి సరుకును దొడ్డిదారిన తరలిస్తున్నారని మద్యం ప్రియులు వాపోతున్నారు. బీర్లు స్టాక్ ఉన్నా ఫ్రిజ్‌లో పెట్టడం లేదని చెబుతున్నారు.అలాగే, ఎన్నికల నేపథ్యంలో అధికార పార్టీ నేతల ఇళ్లకు పథకం ప్రకారం ముందుగా తరలిస్తున్నారని ఆరోపిస్తున్నారు. తక్షణమే మద్యం విషయంలో చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



మెంటాడలో మద్యం షాపు వద్ద ఎగబడుతున్న మందుబాబులు

సాగునీరు విడుదలచేయాలి

● *మడ్డువలస కాలువలో రైతులు నిరసన*

రాజాం: మడ్డువలస రిజర్వాయర్ నుంచి తక్షణమే నీటిని విడుదల చేయాలని సంతకవిటి మండలం పొనుగుటివలస, తలతంపర, బిల్లాని, బొద్దూరు గ్రామాల రైతులు డిమాండ్‌చేశారు. శనివారం బిల్లాని మడ్డువలస కాలువ వద్ద ఆయకట్టు రైతులు గేదెల నారాయణరావు, గాధం అన్నారావు, సలిది కృష్ణ, గొర్లె కూర్మినాయుడు, గొర్లె పెదగు రినాయుడు, మందపల్లి ధర్మారావు, భీర మల్లేష్, గంగిరెడ్డి సీతంనా యుడు, పలిశెట్టి రమణ, గొర్లె శ్రీరాములునాయుడు, శాసపు సింహాచలం తదితరులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీరు విడుదలచేయకపోవడంతో మొక్కజొన్న తదితర పంటలు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. కాలువల ద్వారా నీరం దుతుందని ఆశపడి పంటలు వేశామని, నీరు విడుదల చేయకపోవ డంతో పంటలు ఎండిపోతున్నాయని వాపోయారు. నీటివిడుదలపై మడ్డువలస ప్రాజెక్టు అధికారులను కోరినా స్పందించలేదని, కలెక్టర్ చర్యలు తీసుకుని సాగునీరు విడుదల చేయాలని కోరారు.



బిల్లానిలో మడ్డువలస కాలువ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

చెరువులు, గెడ్డలు కబ్జా నిజం

● *అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ గౌరీశంకర్ ధ్వజం*

విజయనగరం(ఆంధ్రజ్యోతి)/విజయనగరం రూరల్ : విజయనగరంలో చెరువులు, గెడ్డలు కబ్జాకు గురయ్యాయని, ఎమ్మెల్యే కోలగట్ల అనుచరులు ఇందులో కీలక సూత్రధారులని అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ కాళ్ల గౌరీశంకర్ ఆరోపించారు. శనివారం విజయనగరంలో విలేకరులతో మాట్లాడుతూ కోలగట్ల అనుచరుల భూ ఆక్రమణలను తాను సాక్ష్యాలతో నిరూపిస్తానన్నారు. నగరంలోని పురాతన రాజమన్నార్ గోపాలస్వామి ఆలయ భూములను కొల్లగొట్టారన్నారు. ఈ భూములకు సంబంధించి లేఅవుట్లు వేశారని... వాటిలో స్థలాలు కొనుగోలు చేసిన వారు సైతం ఆ భూములు కోల్పోయారన్నారు. 200 సర్వే నెంబరుకు సంబంధించిన స్థలాలు ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు. ఎమ్మెల్యే కోలగట్ల భూ వ్యాపార భాగస్వామి బొట్టా భాస్కరరావు దీనిలో ప్రధాన సూత్రధారి అన్నారు. 2019 నుంచి 2024 మార్చి నెలాఖరు వరకూ విజయనగరం నియోజకవర్గంలో భూ దందాలు జరిగాయన్నారు. స్థలం లేకుండా ఉత్తుత్తి పట్టాలను ఎన్నికల ముందు నిరుపేదలకు అందించడం అలవాటుగా మారిందని విమర్శించారు. నగర శివార్లలోని జమ్ము ప్రాంతంలో నగరంలోని 4, 5, 6, 7 డివిజన్ల నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చారన్నారు. ఇళ్ల పట్టాల్లో పేర్కొన్న స్థలానికి సంబంధించి యాజమాని రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానం నుంచి స్టే తెచ్చుకున్నారన్నారు. దీంతో పట్టాలు ఇచ్చినా లబ్ధిదా రులకు స్థలం చూపించడం ఇబ్బందికరంగా మారిందన్నారు. ఈ సమావేశంలో అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ గాడు అప్పారావు, టీడీపీ నాయకులు శంకరరావు, పట్నాయకుని మోహన్ పాల్గొన్నారు.

ప్రిసైడింగ్ అధికారులే కీలకం

● ఐటీడీఏ పీవో కల్పనాకుమారి



ఈవీఎంల పనితీరుపై అవగాహన కల్పిస్తున్న ఐటీడీఏ పీవో

సీతంపేట: పోలింగ్ రోజున ప్రిసైడింగ్ అధికారుల పాత్రే కీలకమని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీవో కల్పనాకుమారి తెలిపారు. స్థానిక వైటీసీలో నిర్వహిస్తున్న నియోజకవర్గ పీవో, ఏపీవోల శిక్షణ తరగతులను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పోలింగ్ రోజు చేపట్టాల్సిన విధులపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. శిక్షణలో అన్ని అంశాలను తెలుసుకోవాలని, మాక్ పోలింగ్ తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. ఈవీఎంల పనితీరుపై అవగాహన ఉండా లన్నారు. నిర్దిష్ట సమయానికి పోలింగ్ ప్రారంభం అయ్యేలా చూడాలని సూచించారు. ఈ శిక్షణ కార్యకమంలో తహసీల్దార్లు, మాస్టర్ ట్రైనీలు పాల్గొన్నారు.

రాజకీయ ప్రచారాల్లో పాల్గొనరాదు

ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది రాజకీయ పార్టీల ప్రచారాల్లో పాల్గొనరాదని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కల్పనాకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిపై ఇప్పటికే ఉద్యోగులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. ఎంసీసీ, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఉద్యోగులపై నిఘా ఉంచుతాయని పేర్కొన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఎవరూ అతిక్రమించరాదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రాజ్యాంగాన్ని కాపాడడమే కార్మికవర్గ కర్తవ్యం



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాయుడు

మక్కువ: రాజ్యాంగాన్ని కాపాడడమే కార్మిక రంగ కర్తవ్యమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వైనాయుడు అన్నారు. మక్కువలో శనివారం సీఐటీయూ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న నిరంకుశ విధానాలపై పోరాటాలు కొనసాగాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు కృష్ణ, ప్రభాకర్, జ్యోతి పాల్గొన్నారు.

క్రీడా మైదానం కాదండోయ్..



బీవీ పురంలో కోనేరు ఎండిపోవడంతో క్రికెట్ ఆడుకుంటున్న చిన్నారులు

గరుగుబిల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో చెరువులు నీరు లేక బీటలు వారడంతో చిన్నారులకు క్రీడా ప్రాంగణంలా ఉపయోగపడుతున్నాయి. ప్రస్తుతం విద్యార్థులకు ఒంటి పూట బడులు కావడంతో సాయంత్రం వేళల్లో క్రికెట్‌కు అనుకూలంగా చెరువు గర్భాలు తయారయ్యాయి. గతంలో నీటిలో కళకళలాడే చెరువులు, కోనేరులు ప్రస్తుతం క్రీడా ప్రాంగణాల్లా దర్శనమిస్తున్నాయి.

వరద గోడలు లేక ఇబ్బందులు

సీతంపేట: గత ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా సీఎం జగన్ పూర్తి చేయలేదని, ప్రధాన సమస్యలైన వరద గోడలు, రహదారులు తాగునీటి వంటి సమస్యలు పరిష్కరించకపోవడం పట్ల గిరిజనులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బెనరాయి, మేడి ఒప్పంగి మధ్య అనుసంధాన రహదారి గ్రామాల్లో గెడ్డ వద్ద కల్వర్టులు కడతామని, రహదారి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈతమానుగూడలో 200 మీటర్ల వరద గోడ మంజూరు చేస్తామని... బెనరాయి గ్రామంలో 100 మీటర్ల వరదగోడ మంజూరు చేస్తామని ఎన్నికల్లో హామీనిచ్చినప్పటికీ ఇంతవరకు పూర్తి కాలేదని బెనరాయికి చెందిన సవర రమేష్ స్పష్టం చేశారు.

వివాదాలు సృష్టిస్తే చర్యలు తప్పవు

మక్కువ: సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా గ్రామాల్లో ఎటువంటి వివాదాలు సృష్టించినా తగాదాలు పెట్టుకున్నా కఠిన చర్యలకు వెనుకాడబోమని ఎస్ఐ పి.నరసింహమూర్తి అన్నారు. మండలంలోని కొండబుచ్చింపేట, సరాయివలస గ్రామాల్లో శనివారం ఎన్నికల నియమావళిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా జరిగేలా ప్రజలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

వీరఘట్టం: స్థానిక అంబేద్కర్ జంక్షన్‌లోని బాబాసాహెబ్ విగ్రహాన్ని రోడ్డు విస్తరణలో భాగంగా తొలగించి పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉంచారు. రహదారి పనులు పూర్తి కాకపోవడంతో విగ్రహాన్ని అక్కడే విడిచిపెట్టారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి పనులు పూర్తిచేసి విగ్రహాన్ని జంక్షన్‌లో ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

పీహెచ్‌సీ తనిఖీ

కురుపాం రూరల్: మొండెంఖల్ పీహెచ్‌సీని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి మూటక నారాయణ శనివారం తనిఖీచేశారు. పీహెచ్‌సీ పరిధిలో వ్యాక్సినేషన్ విధానంపై ఆయన వైద్యురాలు ప్రజ్ఞను అడిగి తెలుసుకున్నారు. వ్యాక్సిన్ నిల్వల పరిస్థితిపై సమీక్షించారు.

ఇక్కడ వృధ.. అక్కడ వృథా



దత్తిరాజేరు మండల పరిషత్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న మహిళలు

మక్కువ: మండలంలోని నంద గిరిజన గ్రామంలో కొళాయిలు ద్వారా తాగునీరు వృథాగా పోతుంది. రక్షిత మంచినీటి పథకానికి నీరు నింపే సమయంలో కొళాయిలకు ట్యాప్‌లు లేకపోవడంతో నీరు కాలువల్లోకి పోతుంది. వేసవి తీవ్రత ఎక్కువగా ఉండడంతో పాటు భూగర్భజలాలు తక్కువ అవుతున్న సమయంలో నీటిని పొదుపు చేయాల్సింది పోయి వృథాగా వదిలేస్తూ ఉండడంతో తాగునీటి కోసం ఇబ్బందులు పడే ఆస్కారముందని గ్రామస్థులు వాపోతున్నారు. అధికారులు స్పందించి కొళాయిలకు ట్యాప్‌లను అమర్చాలని కోరుతున్నారు. **గంట్యాడ:** ప్రస్తుతం ఎండలు మండుతున్నాయి.. తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్న సందర్భాలు ఉన్నాయి. రామవరం గ్రామంలోని తాగునీటి కొళాయిలకు కొన్ని చోట్ల ట్యాప్‌లు లేకపోవడంతో తాగునీరు వృథా అవుతుంది. దీంతో ఎంతో విలువైన తాగునీరు వృథాగా పోతుంది. చాలా రోజులు ఈ సమస్య ఉన్నా పరిష్కారం కాలేదు. వెంటనే కొళాయిలకు ట్యాప్‌లు లేని చోట కొత్తగా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నీటి ఎద్దడిని నివారించండి

దత్తిరాజేరు: చిన్నరాజేరులో మంచినీటి కొరత తీవ్రంగా ఉందని గ్రామానికి చెందిన పలువురు మండల పరిషత్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. 4 నెలలుగా రక్షిత మంచినీటి పథకం నుంచి నీరు రావడం లేదని, పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్నాథపురం తాడేంద్రవలస, ఇంగిలాపల్లి తదితర గ్రామాల్లో కూడా ఇదే సమస్య ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మంచినీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు.



మక్కువ మండలం నంద, గంట్యాడ మండలం రామవరంలో కొళాయిలకు ట్యాప్‌లు లేకపోవడంతో వృథాగా పోతున్ననీరు

కూటమిదే విజయం: విజయచంద్ర



పార్వతీపురంలో ప్రచారం చేస్తున్న విజయచంద్ర

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడడం తథ్యమని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బోనెల విజయచంద్ర అన్నారు. జగన్నాథపురంలో ఆయన శనివారం ప్రచారం చేశారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా కొత్తపల్లి గీతను గెలిపించాలని కోరారు. గ్రామస్థులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు బార్నాల సీతారామారావు, రవికుమార్, కోరాడ నారాయణరావు, గౌరునాయుడు, పాలకొండ రాజశేఖర్, కోలా మధుసూదనరావు, జనసేన నాయకుడు చందక అనీల్ పాల్గొన్నారు. **సీతానగరం (బలిజిపేట):** జగన్మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం 20 ఏళ్ల వెనక్కి వెళ్లిందని కూటమి అభ్యర్థి బోనెల విజయచంద్ర విమర్శించారు. బలిజిపేట మండలంలోని వంతరం గ్రామంలో ఆయన బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పెంకి వేణుగోపాల్‌నాయుడు, పాలూరి బాబు, రామ్మోహన్‌రావు, బాబ్జీ, గొట్టాపు వెంకటినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో కొనసాగుతున్న చేరికలు

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: పార్వతీపురం పట్టణంలోని 30వ వార్డు పరిధిలో సుమారు 50 కుటుంబాలు శనివారం టీడీపీలో చేరాయి. పార్వతీపురం నియోజ కవర్గంలో బలమైన సామాజిక వర్గానికి చెందిన మాజీ మంత్రి, దివంగత చీకటి పరశురామనాయుడు కుమారులు డాక్టర్ చీకటి బద్రీనారాయణరావు, డాక్టర్ బాల, వి శ్రాంత మండల వ్యవసాయశాఖ అధికారి చీకటి సింగత్‌తో పాటు వారి అనుచరులు ఈదుబిల్లి మురళి తదితరులు టీడీపీలో చేరారు. మాజీ మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు, కూటమి అభ్యర్థి బోనెల విజయచంద్ర ఆధ్వర్యంలో వీరు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

జగదీశ్వరి గెలుపునకు కృషి చేయాలి



కిడారి శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో కలిసిన రెండు గ్రూపుల సభ్యులు

కురుపాం: కురుపాం నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి తోయక జగదీశ్వరి గెలుపునకు ప్రతిఒక్కరూ కృషి చేయాని టీడీపీ అరకు పార్లమెంట్ అధ్యక్షుడు కిడారి శ్రావణ్‌కుమార్ కోరారు. శనివారం కురుపాంలో కూటమి పార్టీల ఆత్మీయ కలయిక సమావేశం జరిగింది. ఈసందర్భంగా శ్రావణ్‌కుమార్, పరిశీలకుడు జనార్దనరావు, మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్ ఆధ్వర్యంలో జగదీశ్వరి వర్గం, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వహణ కార్యదర్శి దత్తి లక్ష్మణరావు వర్గం ఏకమయ్యాయి. ఎటువంటి బేదాభిప్రాయం లేకుండా కలిసికట్టుగా పనిచేసి తోయక జగదీశ్వరి గెలుపునకు కృషిచేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మీ ఓటుతో చంద్రబాబుకు స్వాగతం పలకండి

● కూటమి అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న సంధ్యారాణి, భంజ్‌దేవ్

సాలూరు: 'మీ ఓటుతో చంద్రబాబు నాయుడుకు స్వాగతం పలకాలని... సైకో జగన్‌కు బుద్ధి చెప్పాల'ని కుటమి అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి కోరారు. పట్టణంలోని 14వ వార్డు బంగారమ్మ కాలనీలో శనివారం ఆమె ప్రచారం చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబుతోనే సంక్షేమ రాజ్యం సాధ్యమన్నారు. కొంతమంది వైసీపీ నుంచి టీడీపీ గూటికి చేరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్పీ భంజ్‌దేవ్, ఏఎంసీ మాజీ చైర్మన్ కేతిరెడ్డి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

జయకృష్ణ ఇంటింటి ప్రచారం



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న జయకృష్ణ

పాలకొండ: జనసేన అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను గ్లాసు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని నిమ్మక జయకృష్ణ కోరారు. ఉత్సవ విగ్రహంలా ఉన్న ఎమ్మెల్యే కళావతిని ఇంటికి పంపించాలని కోరారు. కొండాపురం గ్రామంలో శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో టీడీపీ కూటమి నాయకులు కర్నేన అప్పలనాయుడు, గర్భాన సత్తిబాబు, నిమ్మక పాండురంగారావు, తదితరులు పాల్గొన్నారు. ●**సీతంపేట:** హడ్డుబంగి పంచాయతీలో మందపాటి ప్రభు, కుమార్‌రాజు కుమార్ నేతృత్వంలో వైసీపీకి చెందిన పలువురు శనివారం జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వీరిని ఎమ్మెల్యే అభ్యర్థి నిమ్మక జయకృష్ణ పార్టీలోకి ఆహ్వానించారు.

బ్యాలెట్ దరఖాస్తులో గందరగోళం

● ఫారం నెంబరు 12 ఇవ్వలేదని చెబుతున్న ఏపీటీఎఫ్ నేతలు

● పరిష్కారం చూపాలని డిమాండ్



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ నేతలు శ్రీనివాసరావు, శంకరరావు

జియ్యమ్మవలస: మండలంలో పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోవడంలో ఓపీవోలు తీవ్ర ఆందోళన చెందుతున్నామని ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు గుంట్రెడ్డి శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షుడు యర్రా శంకరరావు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శనివారం వీరిరువురు పెదబుడ్డిడిలో విలేకర్లతో మాట్లాడారు. తమకు ఓపీవోలుగా ఆర్డర్ ఇచ్చినప్పుడే ఫారం నెంబరు 12 ఇచ్చి వెంటనే సంతకాలు తీసుకొని ఆ ఫారం నెంబరు 12ను తీసుకెళ్లిపోయారన్నారు. ఇప్పుడు పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేయాలంటే ఆధార్ కార్డు, ఆర్డర్ కాపీ, ఎపిక్ కార్డుతో ఫారం నెంబరు 12 ఖచ్చితంగా ఉండాలన్నారు. ఆన్‌లైన్‌లో ఫారం నెంబరు 12 డౌన్‌లోడ్ చేసుకొని దరఖాస్తు చేద్దామనుకుంటే అప్లికేషన్ రిజెక్ట్ అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల మండలంలో ఓపీవోలుగా ఆర్డర్లు తీసుకున్న వారు గజిబిజి అవుతున్నారని, ఈ నెల 15వ తేదీ చివరి తేదీ కనుక మరింత గందరగోళంగా ఉందని అన్నారు. దీనిపై అధికారులు స్పందించి తగు సూచనలు ఇవ్వాలని వారు కోరారు. దీనిపై విలేఖరులు అడిగిన వెంటనే మండల తహసీల్దార్ స్పందిస్తూ ఓపీవోలు వారి ఆధార్‌కార్డు, ఎపిక్ కార్డు, ఆర్డర్ కాపీ జెరాక్సులు నేరుగా తహసీల్దార్ కార్యాలయానికి ఇవ్వాలని, వాటిని పరిశీలించి పంపిస్తామని అన్నారు.

వాహనాల తనిఖీ



తనిఖీ నిర్వహిస్తున్న దృశ్యం

వీరఘట్టం: వాహనాల్లో ఎటువంటి రశీదులు లేకుండా నగదు, వస్తువులను తరలిస్తే సీజ్ చేస్తామని ఎంపీడీవో ఎంఈ సుబ్రహ్మణ్యం అన్నారు. శనివారం బొడ్లపాడు సెంటర్‌లో వాహనాల తనిఖీ చేశారు. కార్లు, బస్సులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వాహనదారులతో మాట్లాడుతూ ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు.

పోలీసు కవాతు

వీరఘట్టం: మండలంలోని వెంకమపేట, చిదిమి, పాలెమట్ట గ్రామాల్లో శనివారం పోలీసు కవాతు నిర్వహించారు. ఎస్ఐ ఫక్రుద్దీన్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, అందుకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఎస్ఐ ఎస్‌కే ఫక్రుద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా పఠనం



హనుమాన్ చాలీసా పఠిస్తున్న మహిళలు

సాలూరు రూరల్: సాలూరు పెదకోమటిపేట రామా లయంలో సీతారామ ప్రయుక్త వార్షిక బ్రహోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి వైభవంగా సామూహిక హనుమాన్ చాలీసా పఠన కార్యక్రమం నిర్వహించారు. రుత్వికుడు పార్థసారథి ఆధ్వర్యంలో పెద్దసంఖ్యలో భక్తులు హనుమాన్ చాలీసాను పఠించారు. అంతకుముందు ఆంజనేయునికి విశేష పూజలు చేశారు.

క్లుప్తంగా..

ప్రముఖ రంగస్థల కళాకారుడు మృతి

గరుగుబిల్లి: కళా రంగంలో ఆంధ్రాలో ఎంతో పేరు గడించిన ఎన్ని సంగమేశ్వరరావు (75) శనివారం ఉదయం చినగుడబ గ్రామంలోని తన స్వగృహంలో మృతిచెందారు. హార్మోనిస్టుగా ఎన్నో ప్రదర్శనలు ఇచ్చారు. అలాగే కృష్ణుడు, రాముడు, నక్షత్రకుడు, తదితర పాత్రలను పోషించి ఇటు ఆంధ్రాలో, అటు తెలంగాణాలో వేలాది ప్రదర్శనలు ఇచ్చారు. ఈయనకు భార్య ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

ముగిసిన ప్రతిష్ఠోత్సవాలు



సీతారామ లక్ష్మణ ఆంజనేయ ఉత్సవ విగ్రహాలకు పూజలు చేస్తున్న భక్తులు

గరుగుబిల్లి: కొంకడివరం పంచాయతీ సీతారాంపురం గ్రామంలో శ్రీసీతారామ లక్ష్మణ, ఆంజనేయస్వామి వారి ఉత్సవ విగ్రహాలు, కల్పవృక్షం పునర్నిర్మాణ ప్రతిష్ఠ మహోత్సవాలు శనివారంతో ముగిశాయి. శనివారం ఉదయం వివిధ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం విగ్రహాలను ప్రతిష్ఠించారు.

బూరుగలో..

వీరఘట్టం: బూరుగ గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో శనివారం సర్వాజోస్యుల సతీష్‌శర్మ ఆధ్వర్యంలో విగ్రహాలు ప్రతిష్ఠించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. అన్నదానం చేశారు.

చిన్నదిమిలిలో ..

భామిని: చిన్నదిమిలిలో నూతనంగా నిర్మించిన రామాలయ ప్రతిష్ఠోత్సవాలను శనివారం ప్రారంభించారు. ఉత్సవ విగ్రహాలను మేళతాళాలు, కోలాటాలు, పూర్ణకలశాలతో ఊరేగించారు. సాయంత్రం అగ్ని ప్రతిష్ఠ, జలాధివాసం చేపట్టారు. 15న విగ్రహాలకు ప్రాణప్రతిష్ఠ చేయనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు.

సీఐటీయూ ప్రచారం

సీతంపేట: స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మండల కార్యదర్శి ఎం.కాంతా రావు అధ్యక్షతన శనివారం సమావేశం నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు, ప్రధాన కార్యదర్శి వై.మన్మథరావు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో దేశ భవిష్యత్తును నిర్ణయించడంలో కార్మిక సంఘాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

చెట్ల కొమ్మల తొలగింపు

గరుగుబిల్లి: జిల్లా విద్యుత్తుశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కిషోర్‌కుమార్ ఆదేశాల మేరకు గరుగుబిల్లి మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ 33 కేవీ లైన్ పరిధిలో విద్యుత్ లైన్లకు ఆనుకుని ఉన్న చెట్ల కొమ్మలను శనివారం తొలగించారు. దీంతో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేశామని మండల విద్యుత్‌శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ బి.శంకరరావు తెలిపారు. అలాగే పలు చోట్ల విద్యుత్ లైన్లను సరిచేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

అయోమయంలో తెలుగు విద్యార్థుల భవిత

ఒడిశా



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న హెచ్ఎం

రాయగడ: రాయగడలో తెలుగు విద్యార్థుల భవిత అయోమయం గా మారింది. ఐదు దశాబ్దాల కిందట తెలుగు విద్యార్థులకు అన్ని పాఠశా లల్లో బోధనా తరగతులు ఉండేవి. రాను రాను పరిస్థితి మారుతోంది. దీంతో తెలుగు చదివిస్తున్న పిల్లల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. గోవింద చంద్రదేవ్ పాఠశాలలో తెలుగు తరగతులను పూర్తిగా మానుకున్నారు. బాలికోన్నత పాఠశాలలో అరకొరగా బోధిస్తున్నారు. గోపబంధు మున్సిపల్ పాఠశాలలో పూర్తిస్థాయిలో బోధన జరుగుతుండే ది. ఈ ఏడాది గాంధీనగర్ పాఠశాలలో ఐదో తరగతి ఉత్తీర్ణులైన తెలు గు విద్యార్థులు గోపబంధు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో అడ్మిషన్ కోసం వెళితే హెచ్ఎం.. తెలుగు ఉపాధ్యాయులు లేని కారణంగా చేర్పించడానికి నిరాకరించారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు విషయాన్ని పాత్రికేయుల దృష్టికి తీసుకొచ్చారు. దీంతో పాత్రికేయులు హెచ్ఎంను ప్రశ్నించగా... తెలుగు ఉపాధ్యాయుల కొరత కారణంగా విద్యార్థులను చేర్చుకోలేకపోతున్నామని చెప్పారు. సోమవారం నుంచి తెలుగు విద్యార్థులను చేర్చుకుంటామని హామీ ఇచ్చారు. ఇకనైనా తెలుగు సంఘాల ప్రతినిధులు ఉపాధ్యాయుల నియామకం కోసం గట్టిగా కృషి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఓటింగ్ శాతం పెరగాలి

● సబ్‌కలెక్టర్ కళ్యాణి సంఘమిత్ర దేవి



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్, పక్కన నిహార్‌రంజన్

రాయగడ: ఈ దఫా ఎన్నికల్లో శతశాతం ఓటింగ్ జరగాలని... దీనికోసం అధికారులు పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టాలని సబ్ కలెక్టర్ కళ్యాణి సంఘమిత్ర దేవి అన్నారు. ఓటు వినియోగం పౌరుని బాధ్యత అనే అంశంపై శనివారం స్థానిక జిల్లా పరిషత్తు సమావేశ హాలులో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో రాయగడ జిల్లాలో 75 శాతం ఓటింగ్ జరిగిందని... ఈ ఏడాది శతశాతం ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి నిహార్‌రంజన్ కుహర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం

రాయగడ: త్వరలో జరగనున్న ఎన్నికల కోసం స్థానిక జేఎస్‌కో కాలనీలో కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయాన్ని ప్రారంభించింది. ఏఐసీసీ పరిశీలకుడు రవీంద్రదాల్వీ ఈ కార్యాలయాన్ని ప్రారంభించారు. కాంగ్రెస్ నుంచి కొరాపుట్ లోకసభ స్థానానికి సప్తగిరిశంకర్ ఉలాకా, రాయగడ శాసనసభ స్థానానికి అప్పలస్వామి కద్రక పోటీ చేస్తున్నారు. ఈ అభ్యర్థుల ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దుర్గాపండా, సప్తగిరి ఉలకా, అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.



అభ్యర్థుల ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రవీంద్ర, దుర్గాపండా ఉలకా, అప్పలస్వామి తదితరులు